క్లుప్తంగా

కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు

కర్నూలు(అర్బన్): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఆ రాష్ట్ర సీనియర్ నాయకులు కురుబ సిద్ధరామయ్యకు శుభాకాంక్షలు చెబుతూ జిల్లా కురువ సంఘం నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. స్థానిక కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ తనతో పాటు అనేక మంది ఎమ్మెల్యేల విజయానికి కారణమైన సిద్ధరామయ్య ముఖ్యమంత్రి కానున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు పాల సుంకన్న, బిల్డర్ వెంకటేశ్వర్లు, హరిదాసు, ధనుంజయ, దామోదర్, శ్రీరాములు, తిరుపాలు, రామక్రిష్ణ, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సమావేశం

కర్నూలు కల్చరల్: జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు హరిశ్చంద్రనాయుడు, డైరెక్టర్లు బాలనరసింహులు, గోపాలకృష్ణ, మద్దిలేటి, అచ్చన్న, లోకేశ్వరరావు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అక్రమణకు గురైన మూడు పార్కులను ఖాళీ చేయించాలని, సొసైటీకి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి బి.రామకృష్ణ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు.

కొత్త బస్టాండ్‌లో శ్రమదానం

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు కొత్త బస్టాండ్‌లో వరల్డ్ మిషనరీ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ ప్రతినిధులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 42వ వార్డు నాయకురాలు శ్వేతారెడ్డి హాజరై మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన కార్గో - కొరియర్ పార్సిల్స్ డోర్ డెలివరీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా వాణిజ్య సంస్థలు, మందుల దుకాణాలు, వ్యాపారస్తులు తమ పార్సిల్స్‌ను డోర్ డెలివరీ చేసి సమయాన్ని ఆదా చేసుకోవచ్చునన్నారు. కర్నూలు నగర శివారులోని 10కిలో మీటర్లలోపు దూరంలో ఉన్న అడ్రస్‌లకు సేవలు అందుబాటులో ఉన్నాయని, 10 కేజీల్లోపు బరువు పార్సిల్స్ బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు.

రేపు రైతు సంఘం సమావేశం

కర్నూలు(సెంట్రల్): ఏపీ రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 16వ తేదీన కర్నూలులోని సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లాకార్యదర్శి కె. జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు.

రాయలసీమ సమస్యలు పరిష్కరించాలి


కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ప్రజలు ప్రత్యేక రాష్ట్రం దిశగా అడుగులు వేసే అవకాశం ఉందని మాజీ మంత్రి మైసురారెడ్డి అన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో రాయలసీమ సమస్యల సాధనకు చేపట్టిన సంతకాల సేకరణను కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిధులు, నీళ్లు, నియామకాలపై ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం విడిపోయాక రాయలసీమ పూర్తిగా నష్టపోయిందన్నారు. హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జికమ్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీమ అభివృద్ధికి విడతల వారీగా ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో రాయలసీమ ఉద్యమ కారులు ఇస్మాయిల్‌రెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు బీవీ సుబ్బారెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యులు సీమకృష్ణ, శ్రీధర్, మురళి, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

పాణ్యం: సుగాలిమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆదివారం తెలిపారు. వివరాల మేరకు.. కర్నూలు నుంచి ప్రొద్దుటూరుకు గోధుమ పిండి లోడుతో వెళ్తున్న మినీ కంటైనర్ వాహనం పంక్చర్ అయ్యి హైవేలో అడ్డంగా ఆగింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో టీఎస్ 08 హెచ్‌కే 6684 నంబర్ గల కారు రివర్స్ చేసుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో మినీ కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది రోడ్డుకు అడ్డంగా పడిఉన్న మినీ కంటైనర్‌ను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఆ సమయంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు వస్తూ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. పోలీసులకు సూచనలు ఇచ్చి త్వరగా వాహనాలను మళ్లించేలా చర్యలు చేపట్టారు. అనంతరం మరో దారి గుండా ఆయన ఆళ్లగడ్డకు వెళ్లారు.

ఆనంద విహారం

- సెలవుల్లో విహార యాత్రలకు వెళ్తున్నారా!
- పర్యాటక ప్రాంతాల సందర్శనకు ప్రణాళికలు తప్పనిసరి
- చిన్నపాటి జాగ్రత్తలతో యాత్రలు విజయవంతం
- గుర్తింపు కార్డులు, మెడికల్ కిట్లు వెంట తీసుకెళ్లితే మంచిది
- చిన్నారుల జేబుల్లో చిరునామా స్లిప్పులు ఉంచాలి
- ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీల జోలికెళ్ల రాదు


మహానంది ఆలయం


శ్రీశైల క్షేత్రం

కర్నూలు కల్చరల్: పిల్లలకు వేసవి సెలవులు వచ్చేశాయ్. ఉరుకుల పరుగులతో కూడిన యాంత్రిక జీవితానికి కొద్దిగా విరామం ప్రకటించి పిల్లలతో విహారానికి వెళ్తే మనసుకు, శరీరానికి ఎంతో ప్రశాంతత లభిస్తుంది. దీంతో చాలా మంది సెలవుల్లో పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్తారు. అయితే, విహార యాత్రల్లో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా విజయవంతం కావాలంటే తగిన ప్రణాళికలు అవసరం. వాటిని అనుసరించడం మరీ ముఖ్యం. యాత్రకు వెళ్లిన వారందరూ వారివారి పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే చేపట్టిన యాత్రలతో చెప్పలేనంత మధురానుభూతిని పొందగలం.

జిల్లాలో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు

కర్నూలు నగర వనం, శ్రీశైలం, రోల్లపాడు అభయారణ్యం, మంత్రాలయం, యాగంటి, అహోబిలం, ఓర్వకల్లు రాక్ గార్డెన్స్, బెలుం గుహలు, కొలనుభారతి సరస్వతి ఆలయం, బనగానపల్లె నవాబ్ కోట, మహానంది, ఆదోని కోట, సంగమేశ్వరం, ఓంకారం, కాల్వబుగ్గ, కేతవరం , జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం

ఇతర ప్రాంతాల్లో

రాజమండ్రి పాపికొండలు, నాగార్జున సాగర్ డ్యామ్, వేములవాడ, భద్రాచలం, కోటి లింగాల, సోమసిల్ల, యాదగిరి గుట్ట,అరకులోయ, రుషికొండ, భీమిలి బీచ్, బొర్రాగుహలు, అన్నవరం, ద్రాక్షారామం, విజయవాడ కనక దుర్గ ఆలయం, అనంతపురం లేపాక్షి, పుట్టపర్తి, కోటప్పకొండ, మైపాడ్ బీచ్, బారా షాహిద్ దర్గా, వేలూరు గోల్డెన్ టెంపుల్,ముచ్చింతల్, హైదరాబాద్ బిర్లాటెంపుల్, నెహ్రూ జులాజికల్ పార్క్, ట్యాంక్ బండ్

సన్నద్ధత చాలా అవసరం

- విహార యాత్రలకు వెళ్లేటప్పుడు ఉత్సాహం ఎంత అవసరమో, జాగ్రత్త కూడా అంతే అవసరం.
- వెంట ఫొటో, చిరునామాలతో కూడిన గుర్తింపు కార్డులు తీసుకెళ్లడం మంచిది. ఆపత్కాలంలో వీటి అవసరం పడుతుంది.
- స్మార్ట్ ఫోన్లు ఉంటే అందులో నేవిగేషన్ యాప్ ద్వారా మనం వెళ్లే ప్రాంతాలకు దారిని తెలుసుకోవచ్చు. తెలియని ప్రాంతాల మార్గాలను కూడా సులభంగా తెలుసుకోవచ్చు.
- కచ్చితంగా ప్రథమ చికిత్సకు సంబంధించిన వైద్య సామగ్రి వెంట తీసుకెళ్లాలి. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మాత్రలను వెంట బెట్టుకుని వెళ్లాలి.
- విహారయాత్ర ఎన్ని రోజులు ఉంటుందో ముందే తెలుస్తుంది కాబట్టి అన్ని రోజులకు సరిపడా దుస్తులు తీసుకెళ్లాలి.
- పర్యాటక ప్రాంతాలను సందర్శించినప్పుడు వాటి చరిత్రను, అక్కడి విశేషాలను, మధురానుభూతులను డైరీలో రాసుకుంటే అవి జీవితాంతం గుర్తుండిపోతాయి.
- విహార యాత్రకు వెళ్తున్నట్లయితే మనకు సంబంధించిన ముఖ్యమైన బంధువులు, స్నేహితులకు తెలియజేయాలి.
- చాలా రోజులు యాత్రకు వెళ్తున్నట్లయితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ఇంట్లో నగదు, పత్రాలు, బంగారు, వెండి ఇతర విలువైన వస్తువులు ఉంచి వెళ్లకుండా బంధువుల ఇంట్లోగాని, లాకర్‌లోగాని భద్ర పరుచుకోవాలి.
- భారీ మొత్తం బంగారం ఆభరణాలతో యాత్రలకు వెళ్లరాదు
- పిల్లలతో అప్రమత్తంగా ఉండాలి. వారి మెడలో విలువైన ఆభరణాలు వేయరాదు.
- సాధ్యమైనంత వరకు విలువైన వస్తువులు వెంట తీసుకోక పోవడం ఉత్తమం. తప్పని పరిస్థితిలో తీసుకెళ్లాల్సి వస్తే వాటికి బీమా చేయించడం మంచిది.

ఈ జాగ్రత్తలతో పర్యటన సుఖాంతం

- కుటుంబ సభ్యులందరితో పాటు విహార యాత్రకు వెళ్లినప్పుడు ఆ బృందంలో పిల్లలు కచ్చితంగా ఉంటారు. మనం వెళ్లిన ప్రాంతంలో రద్దీ అధికంగా ఉంటే పిల్లల బాధ్యతను ఒక్కొక్కరుగా పంచుకోవాలి.
- చిరునామా, సెల్ నెంబర్ వివరాలు ఉన్న చిన్న స్లిప్పులు పిల్లల జేబుల్లో కచ్చితంగా ఉంచాలి.
- ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకైతే కొంత పరిజ్ఞానం ఉంటుంది. వారికి మన సెల్ నెంబర్,చిరునామ తెలియజేయాలి. అంటే వారు ఒక వేళ తప్పి పోయినా వివరాలు చెప్పేలా ఉండాలి.
- ముఖ్యంగా నదులు, చెరువులు, కోనేర్లు ఉన్న దగ్గర పిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఇష్టానుసారం వదిలేయరాదు. ఏదైనా అనుకోని ఘటన జరిగితే జీవితాంతం బాధ పడాల్సిందే.
- నీటి పరివాహ ప్రాంతాలు, కొండలు, లోయలు లాంటి ప్రమాద కర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈత కొట్టడం, ఫొటోలు, సెల్ఫీలకు అత్యుత్సాహం ప్రదర్శించరాదు.

తీపి జ్ఞాపకాలు మిగిల్చేలా విహార యాత్రలు ఉండాలి



విహార యాత్రకు వెళ్లే వారు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. క్రమ శిక్షణను విస్మరిస్తే ఆపదలు కూడా పొంచి ఉంటాయనే విషయం గ్రహించాలి. మనిషి జీవితంలో విజ్ఞానం, వినోదం సమపాళ్లలో ఉండాలి. మానసిక ఉల్లాసం కోసం ప్రాపంచిక విజ్ఞానాన్ని తెలుసుకోవడం కోసం విహార యాత్రలు ఎంతో తోడ్పడతాయి. పుణ్య క్షేత్రాలను దర్శించినప్పుడు ఆధ్యాత్మిక చైతన్యం ప్రధాన అంశమై భక్తి భావం పెంపొందించుకోవాలి. విహార యాత్రకు బయలుదేరినప్పుడు ఎంత సంతోషంగా ఉంటారో తిరిగి వచ్చేటప్పుడు కూడా యాత్ర తీపి జ్ఞాపకాలతో అంతే సంతోషంగా ఇళ్లకు చేరుకోవాలి.

– పూజారి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, వాణాల జెడ్పీహెచ్ఎస్

సెలవుల్లో ప్రత్యేక ప్యాకేజీలు



సెలవుల్లో ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీలతో టూర్స్ వేస్తుంటాం. రెండు మూడు ఫ్యామిలీలు కలిసి ట్రిప్స్ అడుగుతుంటారు. వారి అభిరుచుల మేరకు కోరుకున్న ప్రాంతాలకు, కోరుకున్న వాహనాలను ఏర్పాటు చేస్తుంటాం. యాత్రలకు వచ్చే వారు కోరుకున్న ఆహార పదార్థాలను తయారు చేసి ఇస్తాం. వెళ్లే ప్రాంతం, వాహనం, ఆహార పదార్థాలకు అనుగుణంగా టూర్ ప్యాకేజీ ఉంటుంది.

– సతీష్, టూరిస్ట్ గైడ్

ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ఇచ్చేందుకు సహకారం అందించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలకు ప్రభుత్వ డిగ్రీ విలీన సిబ్బంది సంఘం రాష్ట్ర నాయకులు సింగంశెట్టి సోమశేఖర్, ప్రభుత్వ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డా.నాగన్న, దలవాయి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వారు మర్యాదపూర్వకంగా ప్రజాప్రతినిధులను కలిశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వేసవి సెలవులు ఇచ్చారని, ఒక్క ఆర్‌యూలో మాత్రమే వేసవి సెలవులు ఇవ్వలేదని, దీని వల్ల తాము, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు సెలవులు ఇచ్చారన్నారు.

వైభవంగా గిడ్డాంజనేయ స్వామి రథోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన శ్రీగిడ్డాంజనేయస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గిడ్డాంజనేయ స్వామికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాన్ని, కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై ఆశీనులను చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. గిడ్డాంజనేయస్వామికి జై అంటూ ప్రజలు పెద్ద ఎత్తున స్వామి నామస్మరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సీనియర్ రాజకీయనాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం వెంకటగిరి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వినాయక ఘాట్ వద్ద హనుమజ్జయంతి వేడుకలను తిలకిస్తున్న దృశ్యం

జై వీర హనుమాన్


సత్యసాయి మందిరంలో హనుమాన్


స్వామివారిని దర్శించుకుని హారతి తీసుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, వడమాల సమర్పణ, హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగర శివారులోని గోదా గోకులంలో హనుమజ్జయంతి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, మన్యుసూక్త హోమం, వడమాలాంకరణ కార్యక్రమాలు జరిగాయి. ధార్మిక ప్రవచనం చేశారు. జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త , మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

- సీతారామ కల్యాణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక్ ఘాట్‌లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపూజ, ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రామకృష్ణ, ఉత్సవ సమితి నాయకులు క్రిష్టన్న, దామోదర్‌రెడ్డి, మహాబలేష్, మురళి, నాగోజీరావు, మోక్షేశ్వరుడు, గోరంట్ల రమణ, మద్దిలేటి, సందడి సుధాకర్, మహేష్ పాల్గొన్నారు.
- కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని హరి హర క్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీరాముని ఆలయ నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు, సంఘం నాయకులు మనోహర్, రాజశేఖర్, చంద్రశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.
- జగన్నాథ గట్టు అభయాంజనేయస్వామి ఆలయం, సూర్య నారాయణ స్వామి ఆలయం, లలితా పీఠం, సత్యసాయి మందిరం, కోట ఆంజనేయ స్వామి ఆలయం, అరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, అశోక్‌నగర్ ప్రసన్నాంజనేయ ద్వారకా సాయినాథ ఆలయం, బుధవార పేట ఈశ్వర ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

స్పోర్ట్స్

ఆరోగ్యం, ఆత్మరక్షణకు 'తైక్వాండో'

కర్నూలు (టౌన్): మార్షల్‌ఆర్ట్స్ క్రీడ తైక్వాండో నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యం, ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక జోహరాపురం రోడ్డులోని రాయల్ కిడ్స్ టెన్నిస్ అకాడమీలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన చిన్నారులకు బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడలు అవసరమన్నారు. తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

కర్నూలు (టౌన్) : తమను తాము రక్షించుకునేందుకు స్వీయ మార్షల్ ఆర్ట్స్ ఉపయోగ పడుతుందని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక బుధవారపేట కిందిగేరిలోని మురికివాడలో జైభీమ్ వికాస సంఘం ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. స్వీయ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంటే తమపై తమకు నమ్మకం వస్తుందన్నారు. ధైర్యంగా సమస్యను ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో జైభీమ్ ప్రతినిధులు భాస్కర్, శ్రీనివాసులు స్వీయ మార్షల్‌ఆర్ట్స్ శిక్షకులు నబీ సాహెబ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధిస్తే... నగదు నజరానా


క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న న్యాయవాది శ్రీధర్‌రెడ్డి

కర్నూలు (టౌన్) : ఈనెల 16 నుంచి 19 వరకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకోల్లులో జరిగే 6 వ రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధిస్తే... నగదు నజరానా అందిస్తానని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జట్టు పతకాలు సాధించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి దాదాబాష, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి మురళీక్రిష్ణ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు


హైదర్సా గేట్ వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా అర్హతే ప్రమాణికంగా ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన 2వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. హైదర్సా గేట్, మధువ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. వాటిని పొంది ఆర్థికంగా ఎదిగిన వివరాలను, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి వర్గానికి అర్హతను బట్టి పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పథకాల ఫలాలు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల్లో మహిళామణులకు సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్‌చార్జ్ ఫిరోజ్, వార్డు నాయకులు చాంద్ బాషా, అనురాధ, మోహన్‌కుమార్, రవిప్రకాష్, హుసేన్, రసూల్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

అమ్మ అనే పిలుపులోనే అంతులేని ఆనందం

- ఆవోపా ఆధ్వర్యంలో ర్యాలీ


కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఆవోపా మహిళా విభాగం మహిళలు

కర్నూలు(అర్బన్): అమ్మ అనే పిలుపులోనే అంతులేని ఆనందం ఉందని ఆవోపా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసుజాత అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో 'వృద్ధాశ్రమం వద్దు ... అమ్మ ముద్దు ' అనే నినాదంతో స్థానిక కలెక్టరేట్ నుంచి మౌర్యా ఇన్ వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. అమ్మ నీ సన్నిధి .. నీ నీడే మా పెన్నిధి, నడిచే గ్రంథం అమ్మ ... నడిపించే విజ్ఞానం అమ్మ అనే సూక్తులతో ముద్రించిన ప్లకార్డులను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీసుజాత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అనేక మంది వివిధ కారణాలను చూపుతూ చిన్నతనం నుంచి పెంచి, పోషించి విద్యాబుద్ధులు చెప్పించి మనిషిగా తీర్చిదిద్దిన అమ్మలను వృద్ధాశ్రమాల వైపు పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంప్రదాయానికి ప్రతి ఒక్కరూ చరమగీతం పాడాలన్నారు. జన్మనిచ్చిన తల్లిని గౌరవించడంతో పాటు చివరి నిమిషం వరకు ఆమెను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డా.యామినీ, చిన్మయా మిషన్ స్వామినీ సుప్రీమానంద, మానవతా స్వచ్ఛంద సంస్థ మహిళా విభాగం, యోగా శిక్షణ కేంద్రం, లలితా పీఠం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

ఆత్మీక కలయిక

కర్నూలు సిటీ: వారంతా రవీంద్ర విద్యానికేతన్ స్కూల్‌లో 1984 నుంచి 91 వరకు 1 నుంచి 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఇప్పుడు ఒక్కొక్కరు ఓ చోట స్థిరపడ్డారు. 30 ఏళ్ల తర్వాత ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి స్కూల్ తరగతి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చదువు చెప్పిన గురువులు ఈశ్వరయ్య, బాష, అరుణ, జ్యోతి, రసీద్‌లను సన్మానం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో స్కూల్ డెరెక్టర్ జి.పుల్లయ్య, సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల అధినేత పీబీవీ సుబ్బయ్య, రిటైర్డ్ టీచర్ పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.

సదస్సులతో మరింత వైద్య విజ్ఞానం


యురాలజిస్టు డాక్టర్ సి. శివశంకర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): నిరంతర వైద్య విజ్ఞాన (సీఎంఈ) సదస్సులు వైద్య విద్యార్థులు, వైద్యులకు మరింత జ్ఞానాన్ని పెంచుకునేందుకు దోహదపడతాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆదేశాల మేరకు ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ విభాగాలు విడివిడిగా జోనల్ సీఎంఈలు నిర్వహించాయి. కర్నూలు మెడికల్ కాలేజీతో పాటు శాంతిరామ్ మెడికల్ కాలేజి, విశ్వభారతి మెడికల్ కాలేజి, అనంతపురం, వైఎస్ఆర్ కడప ప్రభుత్వ మెడికల్ కాలేజిల పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులు, వైద్య విద్యార్థులు నిరంతర జ్ఞానసముపార్జన సాధించాలన్న ఉద్దేశంతో ప్రతి విభాగం జోనల్ సీఎంఈ నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ సదస్సుల ద్వారా వివిధ విభాగాల వైద్యులు వారి వారి అనుభవాలను సెషన్స్ ద్వారా వివరించి అవగాహన కల్పిస్తారన్నారు. తద్వారా ఆధునిక సాంకేతిక యుగంలో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులు, అభివృద్ధి ఫలాలను అందరూ పంచుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రతి సీఎంఈకి వైద్యులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ఇకపై ప్రతి విభాగం తప్పనిసరిగా జోనల్ సీఎంఈ నిర్వహించాలని చెప్పారు. జనరల్ మెడిసిన్ విభాగంలో నిర్వహించిన సీఎంఈలో వివిధ అంశాలపై జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ డి. శ్రీరాములు, నారాయణ మెడికల్ కాలేజి(నెల్లూరు) న్యూరాలజి హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్ఎస్. సంపత్‌కుమార్, కర్నూలు మెడికల్ కాలేజి గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్‌ఓడీ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, కడప జీఎంసీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ పి. సుధాకర్, డాక్టర్ కె. విద్యాసాగర్, డాక్టర్ సి. సందీప్ ప్రసంగించారు. అలాగే గైనకాలజి విభాగం నిర్వహించిన సీఎంఈలో ఎండోక్రైనాలజి హెచ్‌ఓడీ డాక్టర్ పి. శ్రీనివాసులు, డాక్టర్ కె. శ్రీలత, డాక్టర్ ఎ. శ్రీలక్ష్మి, డాక్టర్ ఉమాదేవి, రీ ప్రొడక్టివ్ స్పెషలిస్టు డాక్టర్ జి. విజయలక్ష్మి, అనంతపురం మెడికల్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. పద్మజ, విశ్వభారతి మెడికల్ కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ వహీదాబేగం, కర్నూలుకు చెందిన యురాలజి,ఆండ్రాలజిస్టు డాక్టర్ సి. శివశంకర్‌రెడ్డి, కడప రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణమ్మ ఆయా అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, గైనకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. వెంకటరమణ, డాక్టర్ వి. రాధాలక్ష్మి, డాక్టర్ మాణిక్యరావు, జనరల్ సర్జరి ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవీశ్యామల, డాక్టర్ ఎం. మహేశ్వర రెడ్డి, డాకర్ కె. సోమప్ప పాల్గొన్నారు.